వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 15 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 26వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని అధికారులు తెలిపారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 1వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా, రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 15వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షలను ఈ నెల 26వ తేదీ నుంచి, ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి, దూరవిద్యా విధానం ద్వారా అందించే పీజీడీసీఏ రెండో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆర్టీఓలు బదిలీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఆర్టీఓ, ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ ఆర్టీఓ రాంచందర్‌ను ఆసిఫాబాద్‌కు, నాగోల్ ఆర్టీఓ సురేశ్ రెడ్డిని సూర్యాపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్, టోలిచౌకీ, ఇబ్రహీంపట్నంలోని నలుగురు ఎంవీఐలు సైతం బదిలీ అయ్యారు. మేడ్చల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎంవీఐ జి.రవికుమార్ టోలిచౌకికీ, మిర్యాలగూడ ఎంవీఐ ఇబ్రహీంపట్నం ఆర్టీఓ కార్యాలయానికి బదిలీ కాగా, అవినాశ్, స్వామి సికింద్రాబాద్ ఆర్టీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఖైరతాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో ఇద్దరు ఆర్టీఓలు అవసరం ఉండగా.. ఆరు నెలల నుంచి ఆర్టీఓ రాంచందర్ ఒక్కరే విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం అతడిని బదిలీ చేయడంతో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే ఖైరతాబాద్‌లో ఆర్టీఓలు కరువయ్యారు. ప్రస్తుతం ఎంవీఐ శ్రీను బాబు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో విస్తృత ఉపాధి

- వీఎల్‌వీఎస్‌ఎస్ సుబ్బారావు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 15 : అధునాతన ప్రపంచంలో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని భారత ప్రభుత్వ మాజీ ఎగ్జిక్యూటివ్ ఎకానమిక్ సలహాదారు వీఎల్‌వీఎస్‌ఎస్ సుబ్బారావు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. యూజీ స్థాయిలో బీబీఏ (హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) కోర్సును హైదరాబాద్‌లో తొలిసారిగా ఆంధ్ర మహిళా సభ (ఏఎంఎస్) ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాలలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఎంఎస్ కళాశాలతో పాటు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మరో మూడు కళాశాలల్లో ఈ కోర్సును ప్రారంభించినట్లు చెప్పారు. కోర్సుకు సంబంధించిన అధ్యాపకులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏఎంఎస్ కళాశాలలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్సు పాఠ్యప్రణాళిక రూపకల్పన, ఇతర సహాయ సహకారాల కోసం హెల్త్ కేర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (హెచ్ఎస్ఎస్‌సీ)తో అవగాహన ఒప్పందాన్ని ఆయా కళాశాలలు కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ఎస్‌సీ ఏజీఎం అన్షువర్మ, ఈవో పూజా పులోరియా, కళాశాల చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, కార్యదర్శి డాక్టర్ పి.రజని, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఝాన్సీరాణి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ డాక్టర్ జె.సరిత తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవుల వద్ద మూసి కాలువలో మట్టి పోసిన దృశ్యం

మూసివేస్తున్నారు

మూసి నదిపై బడా బిల్డర్ల కన్ను.. మట్టితో పూడ్చేస్తున్న వైనం

మణికొండ, ఫిబ్రవరి 15 : గండిపేట రెవెన్యూ మండల పరిధిలోని మంచిరేవుల గ్రామ సమీపంలోని మూసి కాలువను ఓ ప్రముఖ నిర్మాణరంగ సంస్థ బండరాళ్లతో మూసేస్తున్నది. స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మంచిరేవుల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి విన్నవించగా విచారణ చేపట్టి సదరు నిర్మాణ రంగ సంస్థకు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు సాయికుమార్ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మైలార్ రంజిత్, ఏర్పుల నర్సింగ్‌రావు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవి శంకర్

నగరంలోకి డీసీఎం, గూడ్స్ వాహనాలకు అనుమతివ్వాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 : గ్రేటర్ హైదరాబాద్‌లో డీసీఎం గూడ్స్ వాహనాల ఎంట్రీ సమయం పెంచాలని బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా శుక్రవారం నిర్వహిస్తున్న రాజకీయ సమ్మెకు బీపీటీఎంఎం దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్ ఫోర్ట్ మజ్దూర్ యూనియన్ (బీఎంఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రవి శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు హాబీబ్ మాట్లాడారు. డీసీఎం వాహనాలకు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు అనుమతి ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఉద్యమ బాట తప్పదని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, జహంగీర్, డీసీఎం యూనిన్ నాయకులు అన్వర్, శ్రీనివాస్, వసీం, అక్బర్, శంకర్ యాదవ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

జంపింగ్ జిలానీలకు ఝలక్..!

చేరికలను వ్యతిరేకిస్తున్న కాప్రా కాంగ్రెస్ నేతలు

పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చర్లపల్లి, ఫిబ్రవరి 14 : అధికారం ఎక్కడుంటే అక్కడ బెల్లం చుట్టూ ఈగల్లా ముసురుకునే జంపింగ్ జిలానీలకు షాక్ తగిలింది. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నాయకులను పార్టీలో చేర్చుకోవద్దని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలం క్రితం ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం విదితమే. అయితే సొంత ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన వెంటనే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతుంది. దీంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ అధిష్ఠానం వద్ద ఈ అంశంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. స్థానిక నాయకులను సంప్రదించకుండా కాంగ్రెస్ పార్టీలో చేరికలు చేపట్టవద్దని సదరు నాయకులు కుండబద్దలు కొడుతున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా చర్లపల్లి డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి పార్టీ మారేందుకు ప్రయత్నిస్తుండటంతో ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్‌కు చెందిన మెజారిటీ నాయకులు ధన్‌పాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ధన్‌పాల్‌రెడ్డి చేరికపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ అధినాయకత్వంకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు మీడియాలోనూ దీనిపై పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. స్థానిక నేతల ఫిర్యాదుతోనే సదరు నాయకుడి చేరికను నిలిపివేసినట్లు సమాచారం.

అమెరికాకు వెళ్తున్న విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మల్లారెడ్డి యూనివర్సిటీ నుంచి విదేశాలకు 43 మంది విద్యార్థులు

మేడ్చల్, ఫిబ్రవరి15 (నమస్తే తెలంగాణ) :మల్లారెడ్డి యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ బీఎస్సీ అగ్రికల్చర్ నుంచి 43 మంది విద్యార్థులు అమెరికా, నెథర్లాండ్ అగ్రికల్చర్ లర్నింగ్ ప్రోగాంకు ఎంపికయ్యారు. మొదటగా ఈ నెల 19న ఇద్దరు విద్యార్థులు అమెరికాకు వెళ్లగా, ఈ నెల చివరి వారంలో 30మంది విద్యార్థులు అమెరికా, 13 మంది విద్యార్థులు నెదర్లాండ్‌కు వెళ్లనున్నారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా మల్లారెడ్డి యూనివర్సిటీ నుంచి వ్యవసాయ విద్యార్థులను అమెరికా, నెదర్లాండ్ పంపినట్లు అగ్రికల్చర్ డీన్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అమెరికా, నెదర్లాండ్ వెళ్లే గొప్ప అవకాశం వచ్చింది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమ యూనివర్సిటీ నుంచి 43 విద్యార్థులు విదేశాలకు వెళ్లడం సంతోషంగా ఉన్నది. వచ్చే సంవత్సరం మూడవ సంవత్సరం విద్యార్థులు ఎంపికయ్యేలా కృషి చేయాలి.

– మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

విద్యార్థులతో కలిసి 5కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మహిళా సమానత్వంతో సమాజ పురోగతి

మేడ్చల్, ఫిబ్రవరి 15 : మహిళా సమానత్వంలో సమాజ పురోగతి సాధ్యపడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మహిళా సమానత్వాన్ని కాంక్షిస్తూ 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబంధు ఏమాయే..?

మళ్లీ పాతపద్ధతి షురూ.. అప్పులు తెచ్చి సాగుచేస్తున్న రైతులు

- మేడ్చల్ జిల్లాలో 48,072 మంది రైతులు
- రైతుబంధు పడింది.. 29వేల రైతులకే
- మిగతా రైతుల పరిస్థితి ఏమిటీ.?
- సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం

మేడ్చల్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): వరి నాట్లు ముగుస్తున్నా.. రైతుబంధు నగదు ఇంకా జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పెటుబడి సాయం అందక పంటల సాగుకు మునుపటి మాదిరిగానే అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3 ఎకరాల రైతులకు మాత్రమే రైతుబంధు నగదు జమ కాగా.. మిగతా రైతుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకరంగా మారింది. జిల్లాలో మొత్తం 48,072 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 29వేల మంది రైతులకు మాత్రమే రైతుబంధు పడినట్లు సమాచారం. అయితే మిగతా రైతులకు రైతుబంధు నగదు జమ కాకపోవడంతో వరి పంట విస్తీర్ణం తగ్గే అవకాశం కనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో వరి విస్తీర్ణం 13,400 ఎకరాలలో సాగు చేసేందుకు వ్యవసాయాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసిన విషయం విధితమే. అయితే ఇప్పటి వరకే వరి నాట్లు పూర్తి కావాల్సి ఉండగా పంట పెట్టుబడి సాయం అందక ఇంకా నాట్లు పూర్తికా లేదని రైతులు పేర్కొంటున్నారు.

గత యాసంగిలో రూ.36కోట్ల 67లక్షలు

గత యాసంగిలో పంట పెట్టుబడి సాయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 48,072 మంది రైతులకు రూ.36కోట్ల 67లక్షల నగదును రైతుల ఖాతాలో జమ చేసింది. ఇప్పుడున్న పరిస్థితిలో రైతుబంధు నగదు జమ కాని రైతులు ప్రతి రోజు ఫోన్‌లలో మెస్సేజ్ కోసం చూడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు, విద్యార్థులు

ఓయూలో సంత్ సేవాలాల్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం నిర్వహించారు. యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మహాభోగ్ భండార్ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సీఎండీ బలరాంనాయక్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు రెడ్యానాయక్, చింత గణేశ్, రాజేందర్‌నాయక్, చంద్రునాయక్, సుశీల, బాలునాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు కమల్ సురేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత సహ సంఘటన్ కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి కరుణాకర్, ఓయూ సీఐ ఆంజనేయులు, ఏబీవీపీ హైదరాబాద్ ప్రముఖ్ రామకృష్ణ, నాయకులు శ్రీహరి, సుమన్, శివకృష్ణ, రమేశ్, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుకన్య బాయికి అభినందనలు

అమెరికా వేదికగా జరుగనున్న ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన యువ లిఫ్టర్ తేజావత్ సుకన్య బాయిని గురువారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఇటీవల జరిగిన సీనియర్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సుకన్య కాంస్య పతకంతో మెరిసింది.

మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం జయంతి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 15 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మభిక్షం 102వ జయంతి సందర్భంగా గురువారం హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, సమన్వయ కార్యదర్శి బి.నాగభూషణం, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదా నందం, పలు సంఘాల నాయకులు కోటి రెడ్డి, కేవీఎల్, పల్లెల వినయ్‌కుమార్, రాజు, శ్రీధర్, రాంమూర్తి పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్లను ఆర్టీసీలోకి తీసుకోవాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవి

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 15 : గత కొన్ని సంవత్సరాలుగా టీఎస్ఆర్టీసీలో అద్దె బస్సులపై డ్రైవర్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఎలాంటి వయోపరిమితి లేకుండా నేరుగా టీఎస్ఆర్‌టీసీలోకి తీసుకోవాలని టీఎస్ఆర్‌టీసీ అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రెంక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమాన్‌టెక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె బస్సు డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాజు, రాష్ట్ర కోశాధికారి గొల్లపల్లి రాజు, ఉపాధ్యక్షులు సంతోష్ నాయక్, పి.శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ళ దేవేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి గడ్డం శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో టోకరా

రూ.15లక్షల చెల్లని చెక్కులు ఇచ్చి మోసం

నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేసిన పోలీసులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 15 : ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో ఓ నిర్మాణ సంస్థ యజమాని ఉపాధ్యాయురాలిని మోసగించాడు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివారల ప్రకారం... మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన ఇల్లందుల చంద్రమణి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సొంత ఇల్లు కొనుక్కునేందుకు ప్రయత్నిస్తుండగా, కూకట్‌పల్లి మలేషియన్ టౌన్ షిప్, రేయిన్ ట్రీ పార్క్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే చెక్కా సుబ్రహ్మణ్యం కలిశాడు. తనకు పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లోని లుంబినీ అమృతా చాంబర్స్‌లో భువనతేజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్మాణ సంస్థ ఉన్నదని, దానికి తాను మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నానని చెప్పాడు. తమ సంస్థ దుండిగల్‌లో గ్రీన్ మెట్రో తులసి భాగ్యనగర్ పేరుతో అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తుందని, ప్రీ లాంచ్ ఆఫర్‌లో రూ.30లక్షలకే 990 చదరపు అడుగుల ఫ్లాట్‌ను అందిస్తున్నామని నమ్మబలికాడు. దీంతో బాధితురాలి కొడుకు అభినయ్ ద్వారా గత ఏడాది డిసెంబర్ 23న రూ.15లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. రోజులు గడుస్తున్నా సంస్థ ఎండీ సుబ్రహ్మణ్యం సరైన సమాదానం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండటంతో అతన్ని నిలదీశారు. డబ్బులు తిరిగి ఇచ్చేయాలంటూ డిమాండ్ చేశారు. దీంతో అంత డబ్బులు ఇప్పుడు ఇవ్వలేనని, రూ.1.50లక్షల విలువైన పది చెక్కులు ఇచ్చాడు. తీరా ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయడానికి వెళితే ఆ ఖాతా మూసివేశారని బ్యాంకు అధికారులు చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు కోర్టులో కేసు పెట్టగా, నాంపల్లి 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు పంజాగుట్ట పోలీసులు నిందితుడిపై సెక్షన్ 406, 420 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు గతంలోనే పలువురిని చీటింగ్ చేసినట్లు తెలిసింది. ఆ కేసు సీసీఎల్‌లో ఉన్నట్లు చెబుతున్నారు.

జాతీయ క్యారమ్స్ చాంపియన్‌షిప్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 15 : మధురై (తమిళనాడు) వేదికగా జరిగిన 48వ జాతీయ జూనియర్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు రజత పతకంతో మెరిసింది. రజత పతకంతో సత్తాచాటి గురువారం రాష్ట్రానికి చేరుకున్న క్యారమ్స్ టీమ్‌కు రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు శోభన్ రాజ్, జమీన్ జన్నత్, శ్యామ్‌బాబు ఘన స్వాగతం పలికారు.

నీ చూపు చెప్పింది నాకు పుస్తకం ఆవిష్కరణ

రచయిత కొరటమద్ది హేమంత్ తొలి నవల 'నీ చూపు చెప్పింది నాకు' పుస్తకాన్ని మాదాపూర్‌లోని ఫీనిక్స్ ఎలినాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వీఎన్ ఆదిత్య, నటుడు అవసరాల శ్రీనివాస్, వంశీ చాగంటిలతో కలిసి ఆవిష్కరించారు.

- కొండాపూర్, ఫిబ్రవరి 15

నగరంలో తగ్గిన ఉష్ణోగ్రతలు..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి15: గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. నగరంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.8 డిగ్రీల సెల్సియస్‌గా.. గాలిలో తేమ 40 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.